# 19. తోడుదొంగలు

"నమస్కారం శాస్త్రి గారూ!"

"ఓహో! చంద్రయ్యగారా! బహుకాలదర్శనం. యీ మధ్య అసలు మెద్రాసే రావటంలేదల్లేవుంది... కూర్చోండి."

"పనులవల్ల తీరుబడిలేక రావటంలేదు... పత్రిక ఎలా వుంది?"

"పత్రికేం... ఒడుదుడుకులేమీ లేకుండా దివ్యంగా సాగిపోతోంది. తమబోటి ప్రసిద్ధ కథకుల సహాయం ఉండగా సంపాదకుడు అలిసిపోయి వినుకుచెందాల్సిన పరిస్థితి ఏర్పడదు... అన్నట్టు మీ శిష్యుడు భలే పుస్తకం రాశాడే!"

"ఎవరూ?"

"సుబ్బారావండీ!... సాంఘికవిప్లవం అన్న యీ పుస్తకం అద్భుతంగా వుంది. యీ మధ్య నేను యీ మాత్రం మంచి పుస్తకాన్నే చూడలేదు. అదంతా మీ శుశ్రూష ఫలితం అని తెలుస్తూనే వుంది."

"ఇదా?.. కిందటేడు రాతప్రతి నా దగ్గరకు తీసుకొచ్చాడు..."

"మీరు ఉపోద్ఘాతంలో వెలిబుచ్చిన అభిప్రాయాల్తో నేను పూర్తిగా ఏకీభవిస్తాను..."

"అది కాదు... వినండి; నిజానికి ఆ అభిప్రాయాలు నేను హృదయపూర్వకంగా ఇచ్చినవి కావు."

"అంటే మీరు రాసి ఇచ్చిన అభిప్రాయాల్ని తనకు అనుకూలంగా ఉండేట్టు సుబ్బారావు దిద్దుకోలేదు కదా?"

"లేదులెండి... కాని, నా వెంటపడి, నా అభిప్రాయాల కోసం రోజుల తరబడి మా యింటిముందు పడిగాపులు కాశాడు. నాకు ఇంకో మార్గమేమీ కనబడక, యీ పీడను వొదిలించుకునేందుకు ఆ అభిప్రాయాల్ని రాసి ఇచ్చాను."

"ఇంకేం! మీరు ఇష్టపడే రాసి ఇచ్చారుగా?"

"ఇష్టమేమిటండీ? నా స్టాండర్డ్‌కు సాహిత్య బాలుడు సుబ్బారావు రచనల్ని మెచ్చుకోవటంకన్న తలవొంపు వుంటుందా? ఇక మెచ్చుకున్నానంటే దానికి కారణం ఏళ్ళ తరబడిగా నన్ను నమ్ముకొని నా సేవ చేస్తున్నాడనీ, రాయకపోతే ఏడ్చిపోతాడనీను! నాకు లోపల ఎలా వున్నా సదభిప్రాయాల్ని రాసివ్వకపోతే అత నెలా అచ్చువేసుకోగలుగుతాడు? 'నా రచన ఎలావుంది!' అని మొహం మీద అడిగితే నిష్కర్షగా 'బాగాలేదు' అని ఎలా చెప్పగలం? అందులోనూ నేనంటే అభిమానంతో భక్తితో ఉన్నవాడి విషయంలో! 'మీ దయవల్ల నాలుగు కాపీలు అమ్ముకోగలుగుతాను' అని బతిమాలి భంగపడేవాణ్ని చూస్తే నాకు... నా కేమిటి... సున్నిత కళాహృదయంగల ఏ మానవప్రాణికి జాలి కలగదూ? మన పేరు పట్టుకొని పాకటంతప్ప ఇంకో మార్గం లేనివాడికి ఆ మాత్రం సహాయమన్నా చెయ్యక తప్పలేదు..

"పోనిండి. పుస్తకంలో మంచి విషయాల్ని చర్చించాడు. మీ పొగడ్తలకు నిజంగా యీ పుస్తకం అర్హమైందే కనుక మీరేమీ విచారపడనక్కర్లేదు."

"అది నేను కాదనను కాని... ఆ మాత్రం సుబ్బారావు చెయ్యగలడా అని మొదట సందేహం కలిగింది పుస్తకం చదువుతున్నంతసేపూ. అదంతా ఎక్కడో చదివిన జ్ఞాపకం బాగా పనిచేసింది. ఎక్కడో వెంటనే తోచలేదు. కాని సుబ్బారావు రచనా విధానంమాత్రం రూఢిగా తెలుస్తూనే వుంది. యీ అనుమానంతో బాధపడలేక 'నిజం చెప్పు' అని నిలవతీసి అడిగేప్పటికి 'కోప్పడకండి... జోసఫ్ రాసిన పుస్తకానికి అనువాదం!' అన్నాడు. 'మరి అనువాదం అని ఎందుకు పెట్టలేదూ?' అన్నాను. 'అలారాస్తే నాకేం పేరువుంటుందీ? ఆ పొగడ్తలన్నీ రచయితకే చెందుతయ్ కదా?. అన్నాడు. "పోనీ - ఏదో కుర్రవెధవ పేరుకోసం పాకులాడుతున్నాడనీ, యీ ప్రథమ యత్నంలోనే దెబ్బతీసి వాణ్ని నిరుత్సాహపరచటం దేనికనీ పస్తాయించి ఊరుకున్నాను. వాడు నిజం చెప్పాక, వాడిమీద కోపానికి బదులు జాలికలిగింది. ఇది అనువాదమని నాకు తెలియనట్టూ, సుబ్బారావు స్వతంత్ర రచనని నేను నమ్మినట్టూ ఉపోద్ఘాతం రాస్తే సరిపోతుందిలెమ్మని..."

"అట్లాగా? ఉండండి... దేనికి అనువాదం అన్నారూ?"

"జోసఫ్ రచన... సోషల్ రివల్యూషన్..."

"ఇంకెందుకూ? ఆ పేర్లు నోటుపుస్తకంలో రాసుకున్నానుగా ! సుబ్బారావును యీ దెబ్బతో కడిగిపారేస్తాను......"

"మీకు ఇంగ్లీషు రాదుకదా- మరి మూలంలోని విషయం ఎలా తెలుస్తుంది?"

"మీరు చెప్తే చాలదూ?"

"నిజానికి సుబ్బారావులాటి యువకుడు ఎంతైనా పైకి రావాలి. ఈ యీడులోనే- అందులోనూ బాల్యావస్థలో ఇలాటి దొంగబుద్ధులు అలవాటైతే ముందు ముందు ఎందుకూ పనికిరాకుండా పోతాడు. ఇప్పుడే ఘాటుగా విమర్శిస్తే - వాడికొకవిధంగా బాగుపడే మార్గాన్ని చూపినట్టే! కాని క్షమించి ఊరుకుంటే తన గ్రంధచౌర్యం బైటపడలేదనీ, తన పుస్తకం చదివినవాళ్ళందరూ ఒఠ్ఠియంబ్రహ్మలనీ గట్టిగా నమ్మి ఇంతకన్న ఘోరమైన చౌర్యాలకు దిగుతాడు. వాణ్ని సక్రమ మార్గంలో పెట్టాల్సిన బాధ్యత మీలాటి సంపాదకులకు ఎంతైనా వుంది. అది మీ విధి. ఆంధ్ర సాహిత్యానికే అభ్యుదయం !"

"ఇంకెందుకూ? వాడి పని పడతాను."

"పడితే పట్టావ్ కాని, నా పేరుమాత్రం బైటపెట్టేవు.... సుబ్బారావు ఊళ్ళోనే ఉన్నాడు. ఒకవేళ మీ దగ్గరికి వస్తాడేమో....తెలిసిందా?"

"ఎందుకు చెప్తానూ?"

"సరే.....వొస్తా......"

## 2

"ఏం సుబ్బారావుగారూ!.... రండి....."

"ఏమిటో దీర్ఘంగా రాస్తున్నట్టున్నారే?"

"మీ సాంఘిక విప్లవం మీద విప్లవం!"

"విమర్శనా?"

"విప్లవమే ! జోసఫ్ రాసిన 'సోషల్ రివల్యూషన్' కు ఇది మక్కీకి మక్కీ అనువాదం అని రాస్తున్నాను. ఇలాటి విమర్శ విప్లవం అనిపించుకోదా? ఏమిటీ అలా తెల్లమొహం వేస్తారు?"

"ఆగు.....ఆగు......భాయీ ! నీకు ఇంగ్లీషు రాదుకదా ! ఇది అనువాదమని రాసేందుకు ఎలా సాహసిస్తున్నావంట?"

"నాకు రాకపోతే ఏమయ్యా? లోకంలో ఆంగ్లభాష నీకు ఒక్కడికి తప్ప ఇంకెవ్వరికీ రాదని అనుకుంటున్నావల్లే వుంది ! జోసఫ్ రచనంటే మారుమూలవి అనుకున్నావా- పాపం ! ఎంత ప్రసిద్ధ రచయిత ! వాడికే ద్రోహం తలపెడతావా?"

"అలా అంటే నేనేం చెప్పేదీ? పోనీ రాస్తే రాశావు కాని.....నీకిది ఎవరు చెప్పారో చెప్పవూ?"

"అలా చెప్పటం అధర్మం !"

"యీ బ్రహ్మరహస్యం ఒక్కడికే తెలుసు. ఆ చంద్రయ్యగాడే నీతో ఊదిఉండాలి."

"ఏం.....ఐతే?"

"అలా దారికిరా..... నా మీదరాస్తే నాకేం నష్టంలేదు కాని, యీ సందర్భంలో చంద్రయ్యగాణ్ని మాత్రం వొదలమాక.... ఇక నీ దగ్గర దాచి లాభంలేదు కనుక, అసలు కథంతా చెప్పేస్తాను-"

"కథా?"

"ఔను.... నీకు తెలిసింది సగం కథే ఐఉండాలి. మిగతా సగమూ ఇదుగో. ఏదో పేరున్న రచయితకదానని రెండు సంవత్సరాల క్రితం చంద్రయ్య స్నేహాన్ని సంపాయించాను. ఆ మొట్టమొదటి రోజునుండే నన్నూ నా రచనల్నీ ఆకాశానికి ఎత్తడం మొదలుపెట్టాడు. అప్పటికి నావి ఏ ఐదారు రచనలో మారుమూల పత్రికల్లో అచ్చయినయ్. అందుకు ఆరురెట్ల రచనల్ని పోస్టు బిళ్ళలు పంపుకొని తిరిగి తెప్పించుకున్నాను. అచ్చయినవి చదివాడో లేదో కాని, చదివినట్టుగానూ, అవి తన అభిమానాన్ని ఆ వెంటనే సంపాయించ గలిగినట్టుగానూ మాట్లాడేవాడు. అతని మాటల ధోరణి చూస్తే - ఆ పాతరచనలు నా దృష్టిలో కోల్పోయిన విలువను తిరిగి తెచ్చుకోవటమే కాకుండా, అంతకన్న గొప్ప రచనల్ని అసలు జీవితంలోనే రాయలేనేమో ననిపించేది. అతని పొగడ్తలకు కొత్త డన్‌లప్ ట్యూబల్లే ఉబ్బిపోసాగాను.. ఒకప్పుడు అది పగిలి ఊరుకుంటుందనే ఊహన్నా తట్టలేదు. ఇలా నా ఎదుటనే కాకుండా ఆయన నా సమక్షంలో, ఇతర స్నేహితుల దగ్గరకూడా నన్ను పొగుడుతూండేవాడు. ఆ పొగడ్తలకు నా ఒళ్ళు పులకరించి, ఆకాశం వైపు చూస్తూ శిలా విగ్రహంలాగా నిలబడిపోయ్యేవాణ్ణి. పరిచయం ప్రారంభమైన రోజు మొదలూ, ఆయన రచనల్ని ఒకటికి పదిసార్లు చదివి (దాదాపు కంఠోపాఠంగా వుండేవి) నా స్నేహితుల ఎదుట పొగుడుతూండే వాణ్ని. ఈ సంగతి ఆయనకు తెలిశాక 'అలా కలుపుగోరుతనంగా ఉండాలి' అన్నాడు. అతని పేరును నేనిలా ప్రచారం చెయ్యటం - అతని కీర్తిని రెట్టించటం- అతని పుస్తకాల్ని రైళ్ళల్లో తిరిగి అమ్మకపోయినా, స్నేహితులందరికీ అంటగట్టి డబ్బులు వసూలుచేసి ఆయనకు సమర్పించుకోవటం, మోతుబరుల్ని పట్టితెచ్చి ఆయన్ను పరిచయం చేసి, ఉన్న పలుకుబడినంతా ఉపయోగించి ముద్రణ ఖర్చుల్ని వసూలుచేసి వాళ్ళనెత్తిన అంకితం పారేసేట్టు చెయ్యటం- మొదలైన సపర్యల్లో నేనెప్పుడూ అశ్రద్ధ చూపలేదు. కాలేజీలో రెండు మూడుసార్లు ఆయన ఉపన్యాసాల్ని కూడా పెట్టించాను. వాల్‌పోస్టర్లు ఇవ్వలేనంత పబ్లిసిటీ ఇచ్చాను. బోర్డులురాసి మెడలో వేసుకొని బజార్ల వెంట తిరగటం మినహాగా ఎన్ని రకాలుగా ఆయన పేరును పాకించాల్సిన అవకాశాలున్నయ్యో- వాటిలో దేన్నీ వొదిలిపెట్టలేదు. నా పేరుతోనూ, నా స్నేహితుల పేరుతోనూ- ఆయన రేడియో ఉపన్యాసాల్నీ, నాటికల్నీ మెచ్చుకుంటూ నా ఖర్చు

మీద పోస్టేజివేసి- వేల ఉత్తరాల్ని రేడియోస్టేషన్‌కు దిగుమతీ చేసాను. ఇలాటి సవ్యాభిప్రాయాల్నీ, అభ్యుదయకరమైన పనుల్నీ అతనే ఒకసారి నూరిపోశాడు. చివరకు అతని ఆంతరంగిక మిత్రుణ్నియ్యాను....."

"నీ జీవిత కథంతా చెప్పేట్టున్నావే?"

"లేకపోతే నీకసలు అర్థంకాదు.... విను: అతను నన్ను శిష్యుడనేవాడు. నేను 'గురూజీ !' అనేవాణ్ని. అతని ఫొటో నొకదాన్ని మా ఇంట్లో - లక్ష్మీదేవి బొమ్మతీసేసి ఆ స్థానంలో వేళ్ళాడేశాను. ఆ ఫోటోకి రోజూ హారతికర్పూరపు పొగలు వేసి, పూలదండల్తో అలంకరిస్తూనే ఉన్నాను. ఏ కాస్త సందర్భం వచ్చినా (రాకపోతే దాన్ని ఎలాగో కల్పించి కూడా !) అతన్ని గూర్చి గొప్పగా మాట్లాడేవాణ్ణి. వినే నాథుడు దొరకాలేకాని - నా ఖర్చుమీద కాఫీపోయించి గంటలతరబడి వాగేవాణ్ణి. ఎన్నిసార్లు మెడ్రాస్ వొచ్చి (నా జేబులోని డబ్బుల్తో!) ప్రతి పత్రికాఫీసుకూ వెళ్ళి ఆయన్ను గూర్చిన దండకాల్ని ఏకరువు పెట్టేవాడ్నో- పత్రికా సంపాదకుడివైన నీక్కూడా బాగా తెలుసు. మహా ప్రవాహం ఒడ్డున చేపలు పట్టేవాడిమాదిరిగా రోడ్డుపక్కనే రోజూ కాపలావేసి ముఖ పరిచయమంటూ ఉన్న వ్యక్తి కనిపించటమే తడువుగా గురూజీ లీలల్నీ, సాహిత్యంలోని వారి అపారనుభవాల్నీ నవరసభరితంగా వర్ణిస్తూండేవాణ్ణి. యీ విధంగా చెమటోడ్చి కృషిచేసి దేశంలో అతనికి పెద్ద పేరును సంపాయించిపెట్టాను......"

"తరువాత....? ...త్వరగా కానీ-"

"కాస్త ఓపిక పట్టుమరి ..... కొంతకాలం గడిచాక నన్నొక పుస్తకం అచ్చువేయమన్నాడు. 'నీకంటే శిష్యగణం వుంది. నాకేమీ లేదు. నేను రాసే పుస్తకం అమ్ముడు కావొద్దా !' అని అడిగాను. తను పరిచయవాక్యాలు రాస్తాననీ, అందులో నన్ను స్వర్గానికి దగ్గరిగా ఎత్తిపడతాననీ, తన పాఠకులందరూ పుస్తకం కొంటారనీ- లోగడ రంగయ్య పద్యాలసంపుటి సందర్భంలో ఎడిటర్లందరికీ వ్యక్తిగతస్నేహ లేఖల్ని రాసి (రికమన్‌డేషన్లు అను !) పుస్తక విమర్శల్లో సదభిప్రాయాల్ని ఇప్పించినట్టే చేయగలననీ వాగ్దానాలు చేశాడు. దాంతో నాకు పెరపెరలాడి 'నేనంత బాగా రాయలేనే?' అన్నాను. 'స్వంతంగానే ఎందుకు రాయాలీ? యీ పుస్తకం చదువు. తెలుగులో దించేసేయ్ !' అని పుస్తకం ఇచ్చాడు. నిజానికి పుస్తకం చాలా బాగుంది. తెలుగులో రాసి తెచ్చాను. చదివి 'చాలా బాగాచేశావ్. కాని అనువాదం అనేమాట తీసేసెయ్' అన్నాడు. 'ఎవరైనా పట్టుకుంటే?' అన్నాను. 'ఎవరూ పట్టుకోరు. ఇందులోని రహస్యం ఏమిటంటే ఇంగ్లీషు వొచ్చిన వార్లందరూ ఆ సాహిత్యాన్నే చదువుతారు కాని, తెలుగు జోలికి రారు; ఎందుకంటే లోకంలోని మంచి సాహిత్యమంతా ఇంగ్లీషుభాషలోనే వుంది. ఇక ఇంగ్లీషు రానివార్లకు ఇది స్వంత రచనో, అనువాదమో ఎలా తెలుస్తుందీ? పోతే, నేను పరిచయ వాక్యాలు రాస్తూండగా ఇంకెవరు ధైర్యంచేసి

పట్టుకోగలుగుతారూ? నీకేం భయంలేదు. అనువాదమని వేస్తేమాత్రం నీకేమీ పేరు రాదు."

చివరకు అతని సలహా అంగీకరించాను. పరిచయ వాక్యాలు రాసి ఇచ్చాడు. అద్భుతంగా ఉంది. 'పుస్తకానికి తగ్గట్టు రాశారు' అన్నాను. 'అదికూడా జోసఫ్‌దే! 'నా రచనలు' అనే అతని పుస్తకంలోని పదకొండో అధ్యాయం మొత్తం మొత్తం తెలుగు చేశాను' అన్నాడు ఆ సంతోషంలో నోరుజారి. నాకు ఆశ్చర్యమైంది. తొలి పలుకులు కూడా గురూజీ స్వంతం కాదన్నమాట! జోసఫ్ రాసిన 'నా రచనలు' అనే పుస్తకం కొని, పదకొండో అధ్యాయం చూశాను. మక్కీకి మక్కీగా సరిపోయింది. అప్పుడు నాకు మరీ ధైర్యం కలిగింది. నాతోపాటు పట్టుబడే గురూజీ ఉండనే ఉన్నాడుగా!'

"ఐతే ఉపోద్ఘాతం కూడా జోసఫ్‌దే నన్నమాట?... ముందు ఆ పేర్లు చెప్పు... రాసుకోవాలి."

"జోసఫ్ రచన 'మైబుక్స్' అనే పుస్తకం. పదకొండో అధ్యాయం... మొత్తం మొత్తంగా!"

"సరే... వాడి పనికూడా పడతాను కాని, ఒక్క శరీరంగా తిరిగిన వాళ్ళు మీరిద్దరూ ఇలా తయారయ్యారేం?"

"మొదట్లో యీ కీలకం తెలియక నా స్వంత వ్యయం మీదా, శ్రమ మీదా ఇంత ప్రచారం చేసి ఇంతవాణ్ని చేశానా... కిందటేడు సినిమా డైలాగ్స్ రాసి, ఆపాట ఫిలింకంపెనీలేపి, నాకున్న రెండెకరాల భూమినీ అమ్మి షేర్స్‌కొనమని వేధించాడు. నాకది ఇష్టంలేక తప్పించుకొని తిరగటం మొదలెట్టాను. అప్పట్నుంచీ నాతో విరోధంగా ఉంటూవొచ్చాడు. నా పరోక్షంలో నన్ను దూషించటమూ, నా సమక్షంలో ముభావంగా ఉండటమూ సాగించాడు. రెండు మూడుసార్లు తను రాసి ఇచ్చిన ముందుమాటల్ని తిరిగి ఇమ్మన్నాడు. నేను ఇవ్వదలచలేదు... అతన్ని సాధించేందుకు నాకు మిగిలిన ఆయుధం అదొక్కటే కనుక! ఆపని కాస్తా చేసిపారేశాను. ఇన్నాళ్ళూ ఎత్తిపట్టిన అతన్ని ఇప్పుడు దూషించటమంటే ప్రాణాంతకంగా ఉండబట్టి, మెదలకుండా కోపాన్నంతా దిగమింగి చచ్చినట్టు పడిఉన్నాను. నన్నూ నా స్నేహితుల్నీ తన పేరుకోసం బాగా ఉపయోగించుకున్నాడు. తన అవసరం తీరగానే మమ్మల్నందర్నీ తృణీకరించాడు. ఇలాటి నీచుల్ని మాత్రం నువ్వు వొదలొద్దు భాయీ!"

"నేనేనా వొదిలేది?'

'సరే... మరిచిపోవోక... వొస్తాను మరి...'

– జనవరి *1948*